


# ప్రపంచ తంత్రం

పంచతంత్రంలో వలెనే బ్రపంచదంత్రమును నై దుభాగమ్ములు అన్నాడు నరసన్న.

"మళ్ళీ నామీద కోపం వచ్చినట్టుంది. మనిద్దరికీ అరగని తిరగలి భాషలో పడ్డారు" అన్నాడు. రాజు.

"ఫరవాలేదు....ఏం. ఈ అయిదూ ఏమిటంటే – ఒకటి : నోటితో మెచ్చుకుంటున్నా నొసలతో వెక్కిరించి 'ఆత్మ గౌరవం' నిలుపుకుంటూ, పబ్బం గడుపుకోవడం.

రెండు : నోటా నొసటాకూడా దారుణంగా మెచ్చేసుగోవడం.

రెండిటా — అనగా ద్వికరణ శుద్ధిగా అసహ్యించుకుని ఆ సంగతి చెప్పడం.

'త్రికరణశుద్ధి' అన్నమాట గురించి పట్టించుకోకూడదు. మనసా వాచా ఒక పద్ధతిలో నడుచుకున్నా, క్రియచేత స్వతంత్ర విధానాలు అనుసరించడం.

ఐదవదీ ఆఖరుదీ ఏమిటంటే శత సహస్రాధిక ముఖాలు గల టోకరా కళను కూలంకషంగా వంటబట్టించుకుని, జీవితానికి పట్టించి కథ నడపడం. టోకరా అంటే చెడ్డపని అనుకోకు. అవసరాన్నిబట్టి ఆ మహా విద్యని వాడితే తప్పులేదు. అబద్ధం ఆడడానికి లైసెన్సు యిచ్చిన ఛాన్సులు ఎన్ని ఉన్నాయో జ్ఞాపకం ఉందా .... వారిజాక్షులందు వైవాహికములందూ అంటూ ఎవడో ఒక లిరికల్ డైలాగు రాశాడు చూడు. అది రాసుకొచ్చి కంఠతా పట్టెయ్. ఒంటికి మంచిది.

ఏం ? ఇప్పుడు ప్రపంచతంత్రం అనే హెడ్డింగుకింద ఒక టోకరా సురుడి కథ చెబుతాను విను : అన్నాడు నరసన్న.